# మనం మిగిలాం



**"నరసింహం పాపం! గుండె ఆగి చనిపోయాడురా" అన్నాడు మా నరసింహం.**

సరిగా మూడురోజుల క్రిందట సాయంకాలం ఆ 'చచ్చిపోయిన' నరసింహంతో చాలానేపు కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేశామేమో- తట్టుకోలేక పోయాము.

అందులోనూ గుండెజబ్బుతోనా?! మా నరసింహాన్ని అడగకుండా వుండలేక పోయాము.

నరసింహం నవ్వాడు— ఆ నవ్వులో విషాదమే మిళితమై వుందో, వ్యంగ్యమే రంగరించి వుందో దిగ్భ్రమలో మునిగి వున్న ఆ క్షణంలో అర్థంచేసుకోలేక పోయాము.

"గుండె ఆగి చనిపోయాడంటే గుండె జబ్బు వుందని కాదురా. అది కానుకోలేక పోయారని అంతకన్నా కాదు. గుండె ఆగకుండా చచ్చిపోయిన వాడెవడైనా చరిత్రలో ఉన్నారేమో నాకైతే తెలియదు. జబ్బు ఏదైనా - గుండె ఆగిపోతుంది. అంతే. దాన్నే చావు అంటారు- విజ్ఞులు. మీలాంటి వెధవ తెలివితక్కువ అజ్ఞానపు సన్యాసులకు ఇలాంటి పెద్ద విషయాలు అర్థంకావులే" అన్నాడు నరసింహం గంభీరంగా.

నరసింహం ధోరణి మాకు మామూలే. పైగా అడ్డు తగిలితే విషయం పక్కదారి పట్టిస్తాడు నరసింహం. ఇంతకీ ఆ చచ్చిపోయిన నరసింహం తాలూకు ఆఖరి క్షణాల వివరం మాకు తెలియాలంటే చచ్చినట్లు నరసింహం వ్యంగ్యానికి తల ఒగ్గక తప్పదు. కనక గతిలేక తలవంచాము.

మా నరసింహం మామీద దయతలిచాడు. అసలు విషయానికి వచ్చాడు.

"అందులోనూ నరసింహం గుండె అలాంటి ఇలాంటి అల్లాటప్పా గుండెకాదు. మీ అందరికీ ఉండే మామూలు తోలుగుండె అంతకన్నా కాదు. పూర్వం ప్రపంచంలో కెల్లా గొప్ప కత్తులు స్పెయిన్‌లో టొలేడో అనే పట్టణంలో తయారయ్యేవి-ఇలాంటి ఘనమైన సంగతులు మీ నిఘంటువుల్లో ఎక్కడా ఏడవ్వు. ఆ కత్తుల్ని ఉక్కుతో తయారు చేసేవారు. అవి వంగేవి. విరిగేవి కావు. రబ్బరు, ఉక్కు కలిపారా అనిపించేది. మళ్ళీ టెన్షన్ ఎలాంటిదంటే— ఓహో!...."

మా వీరభద్రానికి ఒళ్ళు మండింది. సహనం నశించింది. "ఏడిశావ్‌లే కాని— ముందా నరసింహంగాడి సంగతి చెప్పు. లేకపోతే నీ టొలేడో కత్తి అంతు తేలుస్తాను" అన్నాడు.

నిజానికి వీరభద్రం అంతటి వాడే. కత్తిసాములో నిష్ణాతుడు అది మా అందరికీ తెలుసు.


నరసింహం ఓటమి అంగీకరించడానికి సిద్ధంగా లేడు. వాడూ తిప్పుతాడు— గరిటె. పైగా వాణ్ణేమైనా అంటే వాడి పెళ్ళాం మామీద విరుచుకు పడుతుంది. అది వేరే సంగతి.

అసలు విషయం చెప్పాలని వాడికీ ఆత్రంగానే వుంది- అందుచేత తాత్కాలికంగా రాజీపడ్డాడు.

"అంతచేటు ఉగ్రం పనికి రాదురా అబ్బీ! పైగా ఇది సంతాప సభ కూడా" అని వీరభద్రానికి సమాధానంచెప్పి,అందరిచేత బలవంతంగా రెండు నిమిషాలు మౌనం పాటింపజేసి, జరిగినది చెప్పడం ప్రారంభించాడు నరసింహం.

*   *   *

క్రిందటిరోజు సాయంకాలం నరసింహం పెద్దకొడుకు (చచ్చిపోయినవాడి కొడుకని



వేరుగా చెప్పనక్కరలేదు) పేర ఒక టెలిగ్రామ్ వచ్చింది.

"మీ తండ్రిగారి హఠాన్మరణానికి దిగ్భ్రమ చెందాము. మీ కుటుంబంలో అందరికీ మా సానుభూతి తెలియచేస్తున్నాము.

మృతుని ఆత్మకు శాంతి కలుగుగాక!" అని వుంది ఆ టెలిగ్రామ్‌లో.

శంకరం - నరసింహం పెద్దకొడుకు- తండ్రిమాట వేపుదెరుగు, వాడిగుండె ఆగినంతపని అయింది. ఘొల్లు మన్నాడు. టెలిగ్రామ్ అనగానే ఇంటిల్లిపాదీ చేరారేమో సంగతి తెలుసుకొని అందరూ ఏడవడం మొదలుపెట్టారు.

నరసింహం ఊళ్ళోలేదు. బొంబాయిలో వున్నాడు. బొంబాయి—హైదరాబాదు ఎక్స్‌ప్రెస్‌లో ఆరోజే బయలుదేరి వస్తున్నట్లు టెలిఫోన్‌లో చెప్పాడు. మరి ఈ టెలిగ్రామ్ ఏమిటి ?

నరసింహం పేరుకలవారిద్దరూ ప్రాణమిత్రులు. శంకరం ఆ టెలిగ్రామ్ తీసుకొని మా నరసింహం దగ్గరికి పరుగెత్తుకొని వచ్చాడు. వీడు ఆ నరసింహం ఇంటికి వెళ్ళి బొంబాయిలో తెలిసినవాళ్ళు అందరికీ- ముఖ్యంగా చచ్చిపోయిన నరసింహానికి వ్యాపారంలో అండగా ఉన్న కంపెనీ యజమానులతో మాట్లాడాడు. నరసింహం బొంబాయి -హైద్రాబాదు ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరినట్లు రూఢి చేసుకొన్నాడు.

అక్కడి నించి అనేకానేక సంశయాలు తలయెత్తాయి.

నరసింహం బయలుదేరాడా? లేక బొంబాయిలో ప్రాణం పోతే శవాన్ని బండిలో వేసి తీసుకొని వస్తున్నారా? అలాంటప్పుడు ఆ వార్త కుటుంబానికి తెలియజేసి శవాన్ని ఏంచెయ్యమంటారు అని కనుక్కోనడం రివాజుకదా?

లేక దారిలో హఠాత్తుగా పోతే ఆసంగతి తెలిసినవారు టెలిగ్రామ్ పంపారా ?

టెలిగ్రామ్ మళ్ళీ మళ్ళీ చదివారందరూ. సంతకం పెట్టిన వాణ్ణి ఆ ఇంట్లో ఎవరూ ఎరుగరు. అయితే అందులోనూ ఆశ్చర్య పడవలసిన అవసరం లేదు. నరసింహం పెద్ద వ్యాపారస్తుడు. ఎందరెందరితోనో సంబంధాలూ, లావాదేవీలూ ఉన్నవాడు.

మా నరసింహం ఆ "చచ్చిపోయిన వాడి" కుటుంబంవారి ఒత్తిడి కాదనలేక ఆ రాత్రి అంతా వాళ్ళతో గడిపాడు.

అందుకు మరొక కారణం కూడా వుంది. ఆ రాత్రి అంతా సానుభూతి, సంతాపం తెలియజేసే టెలిగ్రాములు వస్తూనే వున్నాయి.

పైగా నరసింహం నిజంగా చనిపోతే గొడవలోపడే భాగస్వాములు, వర్తకులు, సానుభూతిపరులు ఆ రాత్రి అంతా వరదలాగా వచ్చిపడుతున్నారు.

అందరికీ తగు సమాధానాలు ఇస్తూ, చచ్చిపోయినవాడి తరపున మా నరసింహం నిలబడక తప్పలేదు.

* * *

"అనవసరంగా కథ పెంచడం ఎందుకు? టూకీగా చెప్పేస్తాను" అన్నాడు నరసింహం.

"అమ్మయ్య!" అనుకొన్నాము. ఎంత త్వరగా కథ "రసకందాయపుపట్టు" లోకి పోతే అంత రక్తి కట్టుతుంది. మరి, చచ్చిన వాడు ఎలాగూ తిరిగిరాడుకదా?

"దాన్ని - అదే, శవాన్ని అందుకొనడాన్ని ఏమనాలి ? స్వాగతమనాలా? మరేమనాలి? నా మట్టుకు నాకు దానికి తగిన పదమేమీ దొరకడంలేదు.

ఈ వేళ ఒక లక్ష అనుమానాలతో, సవాలక్ష ప్రశ్నలతో, ఒక కోటి భయాలతో నరసింహం ఇంటినించి ఆబాల వృద్ధమూ సికిందరాబాదు స్టేషన్‌కు వెళ్ళాము— బొంబాయి ఎక్స్‌ప్రెస్ వచ్చే టైముకు.

బండి ఆగింది. నరసింహాన్ని అన్వేషిస్తూ మా జనసమూహం కదిలింది.

మొదటి తరగతి పెట్టెలోనించి దిగినవారెవరు ? ఆశ్చర్యపోకండి.

"నరసింహం"— శవంకాక సజీవుడైన మనిషి.

మమ్మల్ని అందర్నీ చూడగానే ఏమనుకొన్నాడోమానవుడు- పెట్టెలోనించి క్రిందికి దిగడంలో కాళ్ళు తడబడడం, మనిషి కంగారు పడడం గమనించాను.


నరసింహాన్ని చూడగానే భార్య- దుఃఖమో, ఆనంద పారవశ్యమో, మరేమో ఆ సర్వేశ్వరునికే తెలుసు—

ఒక్కసారి బావురుమంది. అదొక సంకేతంలా, గుండెల్లో పేరుకొన్న దుఃఖావేశాలు బయటపడడానికి మార్గంలా పని చేసిందేమో —అందరూ ఒక్కసారి ఏడుపు లంకించుకొన్నారు. కొడుకులు, కూతుళ్ళు, ప్రపంచం తెలియని మనుమలు, బంధువులు, మిత్రులు-ఆ మాటకు నేనూ ఏడిచాను.

"ఏమైంది? ఎందుకు ఏడుస్తున్నారు? ముందు చెప్పండి" అన్నాడు నరసింహం.

సమాధానం వెంటనే రాకపోయేసరికి కోపం ముంచుకు వచ్చింది అతడిలో.

"చెప్పి అయినా ఏడవండి. ఏడిచి అయినా చెప్పండి. ఏం జరిగిందో చెప్పండి. ఒక్కరికైనా ఆ మాత్రం ఇంగితజ్ఞానం లేదా- సంగతి నాకు వెంటనే చెప్పాలని" అని




గద్దించాడు.

"ఏమీ కాలేదండీ. అందుకే ఈ ఏడుపంతా. ఎలా చెప్పాలో ఏమి చెప్పాలో కూడా తెలియడం లేదండీ" అంటూ భర్తను వాటేసుకుంది శేషమ్మ.

ఇలాంటివి నా పాల బడుతూ వుంటాయి అదేమి కర్మమోకాని.

నెమ్మదిగా నరసింహాన్ని పట్టుకొని జరిగినదంతా వివరించారు.

మనిషి చలించినట్లు కనుపించాడు.

సరే ఎలాగో ఒకలాగు అందరమూ ఇల్లు చేరుకొన్నాము.-నరసింహాన్ని వెంట బెట్టుకొని.

ఇల్లు చేరుకొన్న తరువాత జరిగిందంతా వివరంగా తెలుసుకొన్నాడు నరసింహం. వచ్చిన టెలిగ్రాములన్నీ చదివాడు.

ఆ తరువాత జరిగినదే ఒక పీడకలలా ఉంటుంది.

"ఇదంతా ఎలా జరినట్లు? ఎందుకు జరిగినట్లు?" అని నన్ను పదేపదే అడిగాడు.

"నేను మాత్రం ఏమి చెప్పగలను?"

నరసింహం డీలా పడిపోయాడు.

కుర్చీలో కూలబడి ఆలోచనలో మునిగిపోయాడు.

మనిషి చేతనాచేతనావస్థలమధ్య ఊగుతున్నాడు. అస్తి నాస్తి విచికిత్స ప్రారంభమైనట్లుంది.

సరిగా ఆ స్థితిలో వచ్చిందొక టెలిగ్రామ్.

"ఒరేయ్ నరసింహం! చచ్చిపోయినట్లు నటించి మా బాకీ ఎగ్గొట్టాలను కొంటున్నావు కాబోలు. పరలోకంలో ఉన్నా నిన్ను పట్టుకుని అణా పైసలతో మా బాకీ వసూలు చేసుకొంటాము. ఖబడ్దార్" అని వుంది ఆ టెలిగ్రామ్‌లో.

టెలిగ్రాం పంపినవారు బొంబాయిలో నరసింహానికి మద్దతుగా వున్న వ్యాపార సంస్థ యజమానులు.

అంతే. అది చదువుకొన్న క్షణం నరసింహం గుడ్లు తేలవేశాడు. కథ ముగిసి పోయింది!

"మాసివ్ హార్ట్ ఎటాక్" అన్నారు డాక్టర్లు.

నా అనుమానం నరసింహం ఉన్నతి చూసి ఓర్వలేని పోటీదారులు పన్నిన కుట్ర ఫలితమే నరసింహం చావు అని. ఏమైనా మన నరసింహం పోయాడు. మనం మిగిలాం" అంటూ ముగించాడు నరసింహం.

మేమెవ్వరమూ మాట్లాడలేదు.

వీరభద్రం మాత్రం ఊరక వుండలేక పోయాడు.

"ఒరేయ్ నరసింహం! నువ్వు టొలేదో గిలేదో అని వాగావే-అదంతా భ్రమరా. నరసింహం గుండె ఉక్కుతో కాదు. చొప్ప దంటుతో తయారైన బాపతు!" అన్నాడు. ●

## వీ. బహా. దే!

వీరు నాకు ఓటేస్తే
మెజారిటీ వీడిదే
మంత్రి పదవి నాకొస్తే
మీకు మటుకు బూడిదే!

నాకు తెలిసినంతలో
దున్నపోతు ఆడదే!
ఎవడన్నా కాదంటే
వాడు అడ్డగాడిదే!

సభ లోపల కూర్చుంటే
నాకు గాఢనిద్రలే!
సంతకాలు పెట్టమంటె
రావు వేలిముద్రలే!

చివరిసారి చెబుతా నా
గుర్తు పందికొక్కులే!
పేదవాళ్ళ కందరికీ
నేను పెద్ద దిక్కులే!

("నీవు నన్ను ప్రేమిస్తే" అనే ఆరుద్ర గేయానికి పేరడీ)

—జొన్నవిత్తుల
రామలింగేశ్వరరావు